ముంచుకొస్తున్న ముప్పు

- 45వ వార్డులో పూడికలతో నిండిన గెడ్డలు
- ఎక్కడికక్కడ నిలిచిన చెత్త, మురుగు నీరు
- సకాలంలో శుభ్రం చేయని పారిశుధ్య సిబ్బంది
- వర్షాల ప్రభావంతో స్థానికుల్లో ముంపు భయం



తాటిచెట్లపాలెం హైవే గెడ్డ కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్త, ఇసుక మేటలు





వాసుదేవనగర్ చర్చి వెనుక గెడ్డలో పేరుకుపోయిన చెత్త, ఇసుకు, మట్టి



తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డు బజార్ పక్కన గెడ్డలో పూడికలు

తాటిచెట్లపాలెం: వర్షా కాలంలో గెడ్డల శుభ్రతను గాలికొదిలేయడంతో ముంపు ముప్పు ముంచుకొస్తోంది. జీవీఎంసీ 45వ వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గెడ్డలు పూడికలతో నిండి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కనే గల గెడ్డ, 80 ఫీట్ రోడ్డులోని తాటిచెట్లపాలెం బజార్ పక్కనున్న గెడ్డల్లో చెత్త, వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోయాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్వహణ లోపం కారణంగా ఏ సమయంలో గెడ్డలు పొంగి ఇళ్లలోకి మురుగు, వ్యర్థాలు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో వీటిని ఆనుకుని నివసిస్తున్న ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క దుర్గంధం, మరోపక్క వ్యాధులను వ్యాపింపజేసే దోమలతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గెడ్డల్లో వ్యర్థాల డంపింగ్
వేసవి అంతా గడిచిపోయింది. వర్షా కాలం వచ్చింది. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏ మాత్రం భారీ వర్షాలు కురిసినా గెడ్డల్లో ఉన్న మురుగు నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరడం ఖాయం. కొన్నిచోట్ల ఇళ్ల పక్కనే గెడ్డలు ఉండటంతో స్థానికులు చెత్తాచెదారాన్ని వాటిలోకే విసిరేస్తున్నారు. మరికొన్ని చోట్ల వ్యాపారులు కూడా తమ వ్యర్థాలను గెడ్డలోనే విడిచిపెడుతున్నారు. తాటిచెట్లపాలెం బజార్‌లో వ్యాపారాలు చేసుకునే పలువురు వ్యాపారులు వ్యర్థాలను పక్కనే ఉన్న గెడ్డలో పారేస్తున్నారు. గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాల్సిన పారిశుధ్య అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో స్థానికుల్లో ముంపు భయం నెలకొంది. వర్షాలు కురుస్తున్నందున సంబంధిత అధికారులు స్పందించి గెడ్డల్లో పూడిక తీత చర్యలు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం, దోమలతో ఇబ్బందులు

తాటిచెట్లపాలెం బజార్, హైవే పెట్రోల్ బంక్ వద్ద గెడ్డలు పూడికలతో నిండిపోతున్నాయి. వీటిని ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు నిత్యం దుర్గంధం, దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి ఎప్పటికప్పుడు గెడ్డలను శుభ్రం చేస్తే బాగుంటుంది.
– ప్రేమ్‌కుమార్, తాటిచెట్లపాలెం

వర్షం కురిస్తే ఇళ్లలోకి మురుగు

వాసుదేవనగర్ పక్కనే ఉన్న గెడ్డ వ్యర్థాలతో నిండింది. దీనిలో చాలా చోట్ల ఇసుక మేటలు వేశాయి. వీటి వల్ల మురుగు నీరు ప్రవహించే మార్గం చిన్నదైంది. భారీ వర్షాలు కురిస్తే పైనుంచి వస్తున్న మురుగు, వర్షపు నీరు హైవేపైకి, గెడ్డ పక్కనే ఉన్న లోతట్టు ఇళ్లలోకి వచ్చి చేరుతుంది. వెంటనే గెడ్డలను శుభ్రం చేయాలి.
– రమేష్, లక్ష్మీనారాయణపురం

గెడ్డలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎగువ ప్రాంతాల నుంచి చెత్తాచెదారం గెడ్డల్లోకి చేరడంతో పాటు స్థానికులు వాటిలోనే చెత్త వేయడంతో అవి నిండుతున్నాయి. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని గెడ్డ వ్యర్థాలతో నిండి రోడ్డుపైకి పొంగుతోంది. గెడ్డలను పరిశుభ్రంగా ఉంచితే దిగువకు ఏ ఆటంకం లేకుండా మురుగు నీరు ప్రవహిస్తుంది.
– వెంకటేశ్వరరావు, కైలాసపురం

ఐరన్ పోల్, మట్టికుప్పల తొలగింపు



పాలబూత్ సెంటర్‌లో దుకాణాల ముందున్న ఐరన్ పోల్‌ను తొలగిస్తున్న కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26, 43, 44 వార్డుల్లో జరుగుతున్న అమృత్ 2.0 తాగునీటి సరఫరా పైప్ లైన్ల పనులతో స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'పర్యవేక్షణ లోపం.. ప్రజలకు శాపం' అనే శీర్షికన ఈ నెల 29న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో దుకాణాల ముందు కాంక్రీట్ దిమ్మతో పడవేసిన ఐరన్ పోల్‌ను బుధవారం సిబ్బంది తొలగించారు. కాంక్రీట్ దిమ్మను పగులగొట్టి స్తంభాన్ని తరలించారు. అదే మార్గంలో బేకరీ, మెడికల్ షాపుల ఎదుట ఉన్న మట్టి కుప్పలను తొలగించారు. దుకాణాల ముందు అడ్డుగా ఉన్న మట్టి కుప్పలను తొలగించడంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్రిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని కాకానినగర్, ఎస్ఏడీ, మాధవధార ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాకేతపురం, రెల్లి వీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానినగర్, ఎస్‌వీకే నగర్, ఎస్ఏడీ, పంజాబీ దాబా ఏరియా, ఐఎన్ఎస్ డేగా ఏరియా, ఆర్‌టీవో ఆఫీస్ రోడ్డు, సచివాలయం ఏరియా, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

2న వాకర్స్ క్లబ్ సమావేశం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ససపల భానుప్రకాష్, సీహెచ్‌వీవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం జరిగే ఈ సమావేశానికి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఆగస్టులో నిర్వహించనున్న సేవా కార్యక్రమాలపై విస్తృత చర్చ జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులందరూ పాల్గొనాలని వారు కోరారు.

యూజీడీ లీకేజీతో ఇబ్బందులు



శాంతిపురంలో కైట్స్ కళాశాల వద్ద మ్యాన్‌హోల్ నుంచి లీకవుతున్న మురుగు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురంలోని కైట్స్ జూనియర్ కళాశాల సమీపంలో గణసాయి మాన్షన్ ఎదుట యూజీడీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు లీకై రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రెండు మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతోంది. రోడ్డుపైన, అపార్ట్‌మెంట్ ఎదుట మురుగు నీరు నిలిచిపోవడతో సుమారు నెల రోజులుగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని అపార్టుమెంట్‌వాసులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి యూజీడీ లీకేజీని అరికట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

14 సెంటర్ల కేటాయింపు హర్షణీయం

మద్రిపాలెం: క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు మోదీ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని బీజేపీ నేత మూల వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 200కు పైగా క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించడం, అందులోనూ రాష్ట్రానికి 14 సెంటర్లు కేటాయించడం హర్షదాయకమన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద క్యాన్సర్ మహమ్మారి నుంచి రోగులను రక్షించేందుకు విస్తృత సేవలు అందించడానికి మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కోట్లాది మంది క్యాన్సర్ బాధితులకు వరం లాంటిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందరికీ ఆరోగ్యం అనేది ప్రధాని సంకల్పమని, ఆ దిశగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

విత్తన రాఖీల తయారీపై విద్యార్థినులకు అవగాహన

ఎంవీపీకాలనీ: గ్రీన్ క్లెమైట్ టీమ్, వీఎంసీ కళాశాల, ఏపీ కాలుష్య నియంత్రణ మండలిల ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీ వీఎంసీ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు విత్తన రాఖీల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.వి. మురళీమోహన్ మాట్లాడుతూ ప్రకృతికి హాని కలిగించే చర్యలకు ప్రజలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశీయ విత్తనాలతో రాఖీలు తయారు చేయడాన్ని విద్యార్థులకు నేర్పించడంపై గ్రీన్ క్లెమైట్ టీమ్‌కు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం స్వదేశీ విత్తనాలతో విద్యార్థినులు రాఖీలు తయారు చేశారు.

రేపటి నుంచి దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాశ్, పీపీసీ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 125వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. బుధవారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1 శుక్రవారం సాయంత్రం స్లీఫ్‌గుర్తు మండపంలో విశాఖ అగ్రపీఠం పరిపాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు పతాకావిష్కరణ చేస్తారని, అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలు వీధుల్లో తిరుగుతుందని, 15న విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల ఆధ్వర్యంలో ప్రధాన ఉత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.విమల్‌రాజ్, ఫాదర్ వై.ప్రేమ్‌కుమార్, పీపీసీ అధ్యక్షుడు ముసిరి రాజేష్, కమిటీ సభ్యులు మరియరత్నం, ఫ్రాన్సిస్, గురు మండలి సలహా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన తప్పనిసరి



సెక్రెడ్ హార్ట్ పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్



సెయింట్ జోసెఫ్ పాఠశాల వద్ద అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న పోలీస్ సిబ్బంది

కంచరపాలెం: విద్యార్థి దశ నుంచే సమాజంపై పూర్తి అవగాహన ఉండాలని కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ అన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్స్ బాలికల ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల బుధవారం విద్యార్థులకు పిల్లల అక్రమ రవాణా, సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. సీఐ రవికుమార్ మాట్లాడుతూ చిన్న వయసులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు ఉంటాయన్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెట్టుకోవద్దని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తెలియజేయాలని అన్నారు. పిల్లలు సోషల్ మీడియాలో ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో గమనిస్తూ నిరంతరం గమనించాలన్నారు. అనంతరం సెయింట్ జోసెఫ్ పాఠశాల నుంచి జ్ఞానాపురం బరియల్ స్ట్రీట్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు అజయ్, అరుణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రెవరెండ్ సిస్టర్ మేరీ రోస్, రెవరెండ్ సిస్టర్ మేరీ హెలెన్, రెవరెండ్ సిస్టర్ వేళంగిణి, అగ్నస్ ఆనందిని, రెవరెండ్ సిస్టర్ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా విజయవంతానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న ×చలో విజయవాడ× కార్యక్రమం నిర్వహించనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం చలో విద్యుత్ సౌధా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, సబ్ స్టేషన్ ఆపరేటర్లు, పిక్ లోడ్, సెక్షన్ ఆపరేటర్లు, ఏటీపీ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు, స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలు పని చేస్తున్నారని చెప్పారు. వీరందరినీ రెగ్యులర్ చేస్తామని అనేక ఏళ్ల నుంచి ప్రభుత్వాలు హామీ ఇస్తున్నా.. అమలు చేయడం లేదన్నారు. ఆగస్టు 7న చేపట్టే మహా ధర్నాకు కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, ఎస్.అవతారం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత ప్రతిభాశాలి రావిశాస్త్రి



రావిశాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ ఆచార్యులు అప్పారావు, సిమ్మన్న

మద్దిలపాలెం: సామాజిక చైతన్య మూర్తి రాచకొండ విశ్వనాథశాస్త్రి(రావిశాస్త్రి) జయంతి వేడుకలు బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రావిశాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిశాస్త్రి తెలుగు సాహిత్యంలో ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించారని, తెలుగు రచయితల్లో అత్యంత ప్రతిభాశాలని కొనియాడారు. నవలాకారుడిగా, కథకుడిగా, న్యాయ కోవిదుడిగా, పీడిత జన పక్షపాతిగా పేరు పొందారన్నారు. ఈయన కథలు విశ్వవిద్యాలయ స్థాయిలో సిలబస్‌లో పెట్టారన్నారు. తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి రావిశాస్త్రి అని ఆచార్య జర్రె అప్పారావు కొనియాడారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ రావిశాస్త్రి మార్గం ఉన్నతమైనది, విలువైనదని, ప్రజలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తి బావి రచయితలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.గిరీష్‌కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బీర సూర్యనారాయణ, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.కృష్ణవేణి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావిశాస్త్రికి నివాళి
ఏయూక్యాంపస్: సాహితీ తేజస్సు రావిశాస్త్రి అని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ అన్నారు. రావిశాస్త్రి జయంతి సందర్భంగా బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సామాజిక న్యాయం కోసం కలంతో పోరాడిన యోధుడిగా రావిశాస్త్రి నిలుస్తారన్నారు.

మానవ రవాణాకు వ్యతిరేకంగా పోరాడుదాం

అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దిన కార్యక్రమంలో అధికారులు



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.ఎస్.నాయుడు



బీచ్ రోడ్‌లో ర్యాలీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: పిల్లలను అక్రమ రవాణా నుంచి, దోపిడీ నుంచి రక్షించడం మనందరి బాధ్యతని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.ఎస్.నాయుడు అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 8లో అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల అక్రమ రవాణా చట్టవిరుద్ధమని, మాదక ద్రవ్యాల రవాణా వంటి నేరాలకు కూడా పిల్లలను దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్తేర్ డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ వర్మ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యతని, ఈ విషయంలో రైల్వే సిబ్బంది, ఆర్పీఎఫ్, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన లక్ష్మి మాట్లాడుతూ యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్ట్, అప్‌హోల్డ్ ఎన్‌జీవోతో కలిసి పిల్లల అక్రమ రవాణా, బాల కార్మికులపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైల్వే భద్రతా దళం అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ బారూక్ మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా విషయంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, వివిధ స్వచ్ఛంద సంస్థల సమన్వయం అవసరమన్నారు.

359 మంది బాలలకు రక్షణ
మానవ అక్రమ రవాణా నుంచి రక్షించబడి, ప్రస్తుతం అప్‌హోల్డ్ సంస్థలో పనిచేస్తున్న రూప తన అనుభవాన్ని పంచుకున్నారు. తాను ఎలా ట్రాఫికింగ్‌కు గురైందో.. అప్‌హోల్డ్ సంస్థ తనను ఎలా రక్షించి, ఆశ్రయమిచ్చిందో వివరించారు. అప్‌హోల్డ్ జిల్లా కోఆర్డినేటర్ జి.డేవిడ్ రాజు మాట్లాడుతూ గతేడాది తమ సంస్థ ద్వారా 359 మంది పిల్లలను, బాల కార్మికులను అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వేధింపుల నుంచి రక్షించినట్లు తెలిపారు.

బీచ్ రోడ్‌లో ర్యాలీ
ఉదయం బీచ్ రోడ్‌లో ఆర్పీఎఫ్, ధాత్రి ఫౌండేషన్, స్పందన స్ఫూర్తి గ్రామీణాభివృద్ధి ఎన్‌జీవో, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం, పవర్ ఎన్‌జీవో ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీవో మమత, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ పుష్పరాణి, జీఆర్పీ ఎస్ఐ మారుఫ్, స్టేషన్ మేనేజర్ టీఎస్ఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చినవాల్తేరులో రెండో భార్య పూర్ణిమతో కలిసి నివసిస్తున్న సిడగం లక్ష్మణ్‌రావు(31) అనే వ్యక్తి మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న త్రీ టౌన్ ఎస్ఐ పి.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది లక్ష్మణ్‌రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకులకు సురక్షితమైన తాగునీరు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో పర్యాటకుల సౌకర్యార్థం దివీస్ లేబొరేటరీస్ రెండు ఆర్వో ప్లాంట్‌లను ప్రారంభించింది. కురుసుర మ్యూజియం, టీయు–142 యుద్ధ విమానం వద్ద ఏర్పాటు చేసిన ఈ యూనిట్లను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ పర్యాటకులకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి దివీస్ యాజమాన్యం అందించిన సహకారం మరువలేనిదన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, దుర్గా ప్రసాద్, దివీస్ ప్రతినిధులు జీఎం వైఎస్ కోటేశ్వర రావు, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో మరమ్మతులు

ఏయూక్యాంపస్: పర్యాటకులు, వాకర్లకు మరింత ఉపయుక్తంగా నిలిచే విధంగా వీఎంఆర్‌డీఏ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని కమిషనర్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఉదయం మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్లతో మాట్లాడారు. పార్క్‌లో పలు నిర్వహణ సంబంధమైన పనులు ఉన్నాయని, వాటి మరమ్మతులను మూడు వారాల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేసామని, త్వరలో మిగతా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్‌వో సుజాతా శివానీ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం

అల్లిపురం: స్మార్ట్ మీటర్లు పెడితే కరెంట్ బిల్లు విపరీతంగా వచ్చి ప్రజలకు ఆర్థిక భారం ఎక్కువవుతుందని, ఈ దురాగతాన్ని అడ్డుకోవాలని సీపీఎం జగదాంబ జోన్ పార్టీ కన్వీనర్ ఎం. సుబ్బారావు, వై.రాజులు ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ నేత కె. గణేష్ ఆధ్వర్యంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నీలమ్మ వేపచెట్టు, అల్లిపురం ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు కరపత్రాలు పంచి స్టిక్కర్లు అంటించారు.

బీచ్ రోడ్డులో వెండి వినాయకుడు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో భారీ వినాయకుడిని నెలకొల్పుతున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దాదాపు రెండు టన్నుల జర్మన్ సిల్వర్‌తో వినాయక విగ్రహాన్ని తయా రు చేసి ప్రతిష్ఠించనున్నారు. బీచ్ రోడ్డులోని ఏపీఐఐసీ మైదానంలో బుధవారం ఉదయం పూజా కార్యక్రమాలను నిర్వాహకుడు సీరపు కనకరాజు నిర్వహించారు. వినాయక మందిరం బయట భారీగా టీటీడీ తరహాలో సెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పశ్చిమ బెంగాల్, ఒడిశాకు చెందిన కళాకారులు దీనిని సిద్ధం చేస్తున్నారన్నారు. యూత్ ఐకాన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో గతంలో చాక్లెట్ గణేష్ విగ్రహం ఏర్పాటు చేశామని, గతేడాది అయోధ్య రామ మందిరం సెట్ వేసి ప్రతిష్ఠించిన బాల గణపతి ని అందరూ దర్శించుకున్నారన్నారు. ఈ ఏడా ది వెండి వినాయకుడిని ప్రతిష్ఠించి విశాఖ వాసులకు దర్శనం కలిపిస్తామన్నారు. కుటుంబ సమేతంగా వచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు.